సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 3 । అక్టోబర్ । 2024



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. కడపలో గాంధీ బొమ్మ ఎదురుగా నిరసన దీక్ష ప్రారంభించారు. -8లో



పేదల డాక్టర్.. ఈసీ గంగిరెడ్డి

దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పేదల డాక్టర్‌గా పులివెందులలో గుర్తింపు పొందారు. ఆయన హస్తవాసి తగిలితే ఏ రోగమైనా నయమవుతుందని ప్రజల నమ్మకం. -8లో

గరిష్టం/కనిష్టం
37.0/26.2

వాతావరణం

జిల్లాలో బుధవారం 26.2 - 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప కార్పొరేషన్: కొప్పర్తిలోని ఎంఎస్ఎంఈ టెక్నికల్ సెంటర్‌ను సీఆర్‌డీఏకు తరలించడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరుగనుంది. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

మెడికల్ అండ్ హెల్త్ ఆర్డీగా డాక్టర్ రామ గిడ్డయ్య



కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4) రీజనల్ డైరెక్టర్ గా డాక్టర్ రామ గిడ్డయ్య నియమితులయ్యారు. ఈయన కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తూ పదోన్నతి పై రీజనల్ డైరెక్టర్ గా విశాఖపట్నంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన కడపకు బదిలీ అయ్యారు. త్వరలో ఆర్డీగా రామగిడ్డయ్య బాధ్యతలను స్వీకరిస్తారు. గతంలో కూడా ఈయన ఆర్డీగా కడపకు వస్తారనే ప్రచారం ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగింది. ప్రభుత్వ నిర్ణయంతో తాజాగే ఆయనే కడపకు వస్తున్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జయనగర్ కాలనీ బాలికల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చామ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు విజయవాడలో ఈనెల మూడోవారంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా సబ్‌జూనియర్ బాలబాలికల జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సుబ్బమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు: జి.వి.చరణ్ (కెప్టెన్), జి.హేమవెంకటతరుణ్, సి. యోగేంద్ర, జి.వి.కిరణ్, పి. గౌతమ్, ఎ.సంతోష్, వి.గంగా కార్తీక్, పి.రామ్‌చరణ్, కె.జాఫర్, ఎస్ఎండీ గౌస్, జి.విజయ్, ఎస్.కె.మౌలాలి. కోచ్: కృష్ణప్రసాద్, మేనేజర్ పి. సువర్ణ.

జిల్లా బాలికల జట్టు: ఎం. చంద్రమౌనిక (కెప్టెన్), వి.అమృతవర్షిణి, డి.సింధు, సి. బిందుమాధురి, డి.షర్మిల, పి.దుర్గ, ఎస్.ముస్కాన్, డి.తస్లీం, కె.లాస్య, ఎం.సాయిచైత్ర, పి.హర్షిత, బి.మౌనిక. కోచ్: బి. వెంకటసుబ్బమ్మ, మేనేజర్ సి. మంజులత.

విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజారుస్తారా..?



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: యోగి వేమన విశ్వవిద్యాలయానికి లైంగిక ఆరోపణలు ఉన్న వ్యక్తులను ఉన్నత పదవులలో నియమిస్తూ విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అఖిలభారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి వలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైవీయూ రిజిస్ట్రార్‌గా రాంప్రసాద్‌రెడ్డి నియామకాన్ని నిరసిస్తూ బుధవారం గాంధీ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇన్‌చార్జి వీసీ కృష్ణారెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు, లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని ఉన్నత పదవులలో నియమించడం ఏమిటని ప్రశ్నించారు. ఇన్‌చార్జి వీసీగా ఉన్న కృష్ణారెడ్డికి తోడుగా లైంగిక ఆరోపణలు ఉన్న వ్యక్తిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించుకున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పారని కృష్ణారెడ్డి డబ్బులు తీసుకుని రిజిస్ట్రార్ ను నియమించారని వారు ఆరోపించారు. 2011లో మహిళా పీహెచ్‌డీ స్కాలర్ , విద్యార్థినిల పట్ల రాంప్రసాద్‌రెడ్డి లైంగిక కార్యకలాపాలపై ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ వేయడం అందరికీ తెలిసిందేనన్నారు. వర్సిటీలో కామాంధులకు పదవులు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తరఫున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



షాపులన్నీ మావే..!

మేము అధికారంలో ఉన్నాం. మద్యం షాపులన్నీ మా వాళ్లకే దక్కాలి. ఎవరూ దరఖాస్తులు చేయవద్దు.. అని తెలుగుదేశం పార్టీ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. కడప నగరంతో పాటు మిగిలిన నియోజకవర్గాలలో కూడా తమ వాళ్లకే మద్యం షాపులు వచ్చేలా టీడీపీ నేతలు సిండికేట్ దిశగా అడుగులు వేస్తున్నారు.

- ఇతరులెవరూ దరఖాస్తు చేయవద్దంటూ టీడీపీ నేతల హుకుం
- మద్యం షాపుల టెండర్లలో సిండికేట్
- బార్ల తరహాలోనే చేజిక్కించుకోవాలనే దిశగా అడుగులు



నియోజకవర్గం	మద్యం షాపులు
కమలాపురం	13
కడప	21
మైదుకూరు	19
బద్వేల్	17
జమ్మలమడుగు	26
ప్రొద్దుటూరు	17
పులివెందుల	19
రాజంపేట (రెండు మండలాలు)	07

సాక్షి ప్రతినిధి, కడప: అధికారం అడ్డుపెట్టుకుని మద్యం షాపులన్నీ చేజిక్కుంచుకోవాలనే దిశగా టీడీపీ నేతలు అడుగులు వేస్తున్నారు. అధికారం ఆదాయమార్గం కావాలనే ఏకైక లక్ష్యంతో ప్రకృతి సంపదతో మొదలు పెడితే, భూకబ్జాలు, షటిల్ మెంట్లతో మునిగి తేలుతున్నారు. అది చాలదన్నట్లు ప్రభుత్వ పాలసీని అడ్డం పెట్టుకుని మద్యం షాపులను ఏకపక్షంగా దక్కించుకోవాలనే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇతరులెవరూ దరఖాస్తు చేసుకోరాదని.. జిల్లాలోని మద్యం షాపులన్నీ తమ వాళ్లకే దక్కాలంటూ హుకుం జారీ చేస్తున్నారు.

- వైఎస్సార్ జిల్లాలో 139 మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదలయింది. దరఖాస్తు స్వీకరణకు అక్టోబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ తుది గడువు విధించారు. ఆ మేరకు అందిన దరఖాస్తులను బట్టి అక్టోబర్ 11న జడ్పీ మీటింగ్ హాల్‌లో లాటరీ ద్వారా మద్యం షాపులను కేటాయించనున్నారు.
- అక్టోబర్ 12వ తేదీ 2024 నుంచి 30 సెప్టెంబర్ 2026 వరకూ మద్యం షాపులకు లైసెన్సు కోసం దరఖాస్తులను ఎక్సైజ్‌శాఖ ఈఎస్ రవికుమార్ ఆహ్వానించారు. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో లైసెన్సు ఫీజు 2024-25 ఏడాదికి రూ.55 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.65 లక్షలుగా నిర్ణయించారు. 2025-26 ఏడాదికి మద్యం లైసెన్సుదారులు 10శాతం అదనంగా చెల్లించాలనే నిబంధన పొందుపరిచారు. కాగా మద్యం షాపులన్నీ తమ వాళ్లకే సొంతం కావాలనే దిశగా టీడీపీ నాయకులు అడుగులు వేస్తున్నారు. మనం మనం ఏకమైతే షాపులన్నీ మనవేనంటూ పొరుగు నియోజకవర్గాల నేతలతో మంతనాలు నిర్వహిస్తున్నారు. పోటీ పడరాదంటూ ముందస్తు ఒప్పందం చేసుకుంటున్నారు.

▶▶ కడపలో ఏకపక్షం కావాలనే దిశగా...

కడప కార్పొరేషన్ పరిధిలో 21 మద్యం షాపులకు టెండర్లు ఆహ్వానించారు. కాగా, జిల్లా కేంద్రమైన కడపలో మొత్తం మద్యం షాపులు దక్కించుకోవాలనే దిశగా టీడీపీ నేతలు ఎత్తుగడలు వేస్తున్నారు. ఆమేరకు కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి సన్నిహిత నేతలు వ్యూహ రచన చేస్తున్నారు. పాతకడప మాజీ సర్పంచ్, చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన మరోనేత, ఓ మద్యం వ్యాపారి జట్టుకట్టి మద్యం షాపులకు దరఖాస్తు చేయాలనుకునే వారిని పసిగట్టి ఫోన్లు చేస్తున్నారు. మీరెవ్వరూ దరఖాస్తు చేయవద్దంటూ హుకుం ప్రదర్శిస్తున్నారు. కాదు, కూడదంటే వాసన్నతో మాట్లాడాలంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పేరును వాడుతున్నారు. ఇదే వ్యవహారం కమలాపురం నియోజకవర్గానికి చెందిన వారితో కూడా మాట్లాడడంతో వ్యవహారం బెడిసికొట్టింది. మీరెంతా, మీ స్థాయి ఎంత? అంటూ ఓ నాయకుడు తిరగబడి మాట్లాడినట్లు సమాచారం. ఆపై చేసేది లేక, సిండికేట్ దిశగా అడుగులు వేస్తున్నారు. కడపలో బార్లు స్వాహా చేసినట్లుగా మద్యం షాపులు ఏకపక్షంగా దక్కించుకుకోవాలనే ఎత్తుగడల్లో కాస్తా వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం.

▶▶ కమలాపురం నేతలతో మంతనాలు...

కడపలో మద్యం షాపులన్నీ దక్కించుకోవాలని చూస్తున్న కడప టీడీపీ నేతలు కమలాపురం నాయకులతో మంతనాలు చేస్తున్నారు. కమలాపురం నేతలు దరఖాస్తులు చేసుకున్నా, లాటరీలో లభించిన షాపుల ఆధారంగా వాటాలు సరిచేసుకొని సిండికేట్ కావాలనే దిశగా కడప నేతలు ఎత్తుగడలు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మీ జట్టులో మేముంటామంటూ కొంతమంది మద్యం వ్యాపారులు కమలాపురం నేతలను ఆశ్రయిస్తున్నట్లు సమాచా రం. మరికొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా అధికారం మాదే. మద్యం షాపులు దక్కించుకున్నా నిర్వహణ సాధ్యం కాదనే హెచ్చరికలను వారికి టీడీపీ నేతలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే తరహా వ్యవహారం పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరుల్లో కూడా తెరపైకి వస్తున్నట్లు సమాచారం.

- ఈ విషయమై ఎక్సైజ్ ఈఎస్ రవికుమార్‌ను వివరణ కోరగా, నిరభ్యంతరంగా దరఖాస్తులు చేసుకోవచ్చు.. ఆన్‌లైన్ పోర్టల్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. లాటరీలో లభించిన టెండర్ దారుడు మద్యం షాపులను నిబంధనల మేరకు నడుపుకునేందుకు సహకరిస్తామని వివరించారు.

టెట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- టెట్ జిల్లా అబ్జర్వర్ మధుసూదన్‌రావు



అధికారులకు సూచనలు ఇస్తున్న ఏపీ టెట్ జిల్లా అబ్జర్వర్ మధుసూదన్‌రావు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభమయ్యే టీచర్ ఎలిజిబులిటి టెస్టు(ఏపీ టెట్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర కేజీబీవీ సెక్రటరీ, టెట్ జిల్లా అబ్జర్వర్ మధుసూదన్‌రావు సూచించారు. బుధవారం ఆయన జిల్లాలో టెట్ పరీక్ష కోసం ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను డీఈఓ మర్రెడ్డి అనురాధతో కలిసి పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు, కంప్యూటర్ ల్యాబ్స్ పరిశీలించారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో కార్యాలయ అధికారులతో పాటు డిపార్టుమెంట్ అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తమకు సంబంధించిన ఒరిజినల్ హాల్ టికెట్‌తోపాటు ఫోటో గుర్తింపు కార్డు వెంట తీసుకునిరావాలని సూచించారు. అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు సంబంధించిన సెల్‌ఫోన్, ఇయర్‌ఫోన్స్, క్యాలికులేటర్, పెన్సిల్, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. అంధ, రెండు చేతులు లేని వైకల్యం కలిగిన అభ్యర్థులకు మాత్రం 50 నిమిషాలు అదనపు సమయం కేటాయిస్తామన్నారు. డిపార్టుమెంట్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా సజావుగా పరీక్ష నిర్వహణ జరపాలని ఆదేశించారు. ఇందులో ఏదైనా పొరపాటు జరిగే చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మర్రెడ్డి అనురాధ, డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

హింసే ఆయుధంగా పనిచేస్తున్న ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు
పి. రవీంద్రనాథ్‌రెడ్డి



వన్‌టౌన్ సర్కిల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: మహాత్మాగాంధీ అహింసే ఆయుధంగా భారత దేశానికి స్వాతంత్ర్యం తీసుకొస్తే, ఏపీలో టీడీపీ ప్రభుత్వం హింసే ఆయుధంగా పని చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక వన్‌టౌన్ సర్కిల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి పనిచేసిన వారిని, ఓట్లు వేసిన వారిని ఈ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తూ ఊర్ల నుంచి వెళ్లగొడుతోందన్నారు. గాంధీ జయంతి రోజున మద్యంపాలసీని తీసుకొచ్చిన ముఖ్యమంత్రిని ఏమనాలో ప్రజలే నిర్ణయించాలన్నారు. మద్యం ఏరులై పారే విధంగా మద్యం పాలసీ తీసుకురావడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేలు షాపులు వదలడం లేదు, అన్ని ట్రాన్స్‌ఫర్లు, ఉద్యోగాలకు డబ్బులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ 2.50 లక్షల మందికి ఉద్యోగాలిస్తే...టీడీపీ ప్రభుత్వం 2లక్షల మంది వలంటీర్లను, మద్యం షాపుల్లో పనిచేసే 15 వేల మందిని తీసేశారన్నారు. ఈ ప్రభుత్వంలో నిరుద్యోగ భృతిలేదు...ఉద్యోగం లేదు...ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం తీసుకురావాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. వలంటీర్లకు రూ.10 వేల జీతమిస్తామని హామీ ఇచ్చి వలంటీర్లనే పక్కన బెట్టారన్నారు. వైజాగ్ ఉక్కు పరిశ్రమలో 4వేల మంది కార్మికులకు ఉద్వాసన పలికారన్నారు.
- ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, కరిముల్లా, పి. జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలయాస్, పాకా సురేష్, సీహెచ్ వినోద్, కె. బాబు, కె. రాజశేఖర్‌రెడ్డి, మున్నా, కిరణ్, బండి ప్రసాద్, షఫీ, పస్తం అంజి, మహిళా నేతలు పత్తి రాజేశ్వరి, మూలే సరస్వతి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, ఉమామహేశ్వరి, బి. మరియలు, తులశమ్మ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ ఆశయాలే స్ఫూర్తి: ఎస్పీ

కడప అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకుని బ్రిటీష్ వారిని ఎదిరించి, శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించి చరిత్రలోనే మహోన్నత వ్యక్తిగా గాంధీజీ జాతిపితగా నిలిచారని కొనియాడారు. మహాత్మాగాంధీని అందరూ ప్రేమగా 'బాపూజీ' అని పిలుస్తారనీ, బాపూజీ భారతదేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలోనూ తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. మహాత్మా గాంధీ చేసిన ఉద్యమాలు, సంస్కరణలు గుర్తు చేశారు. స్వదేశీ విధానం, గ్రామాల అభివృద్ధి, సమైకృతా భావాన్ని గుర్తు చేసుకున్నారు. అలాంటి మహనీయుని ఆలోచనలు, ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, ఏ.ఆర్. డీఎస్పీ మురళీధర్, ఆర్.ఐలు వీరేష్, టైటస్, శ్రీశైలరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

క్షణికావేశం తగదు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ఖైదీల సంక్షేమ దినోత్సవంలో
కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప అర్బన్: క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోవాల్సి వస్తుందని ఖైదీలను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలియజేశారు. కడప కేంద్ర కారాగారంలో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి (ఖైదీల సంక్షేమ దినోత్సవం), లాల్ బహదూర్ శాస్త్రి 120వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ శివశంకర్... జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్. రవిబాబు, రిమ్స్ ఆర్ఎంఓ, వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ వై. శ్రీనివాసులు, జైళ్లశాఖ రాయలసీమ రేంజ్ ఇన్‌ఛార్జ్ డీఐజీ, కడప కేంద్రకారాగారం సూపరింటెండెంట్ కె. రాజేశ్వరరావుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖైదీల కుటుంబాలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నాయన్నారు. చదువు సంస్కారాన్ని నేర్పిస్తుందని, అందరూ చదువుకోవాలని.. అప్పుడే నేర ప్రవృత్తి తగ్గుతుందన్నారు. ఎవరితోనూ ద్వేషం పెంచుకోవద్దని, చిన్నచిన్న పనులు నేర్చుకుంటూ, నైపుణ్యతను పెంచుకుంటూ తిరిగి సమాజంలోకి మంచి పౌరులుగా వెళ్లాలని ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో మానసిక కౌన్సిలర్ సునీత, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు కె. జవహర్ బాబు, పి.రమేష్, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జి. పుష్పలత, డాక్టర్ కె. వినయ్, డాక్టర్ కె. నవీన్, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, గార్డింగ్ సిబ్బంది, మినిస్టీరియల్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో పటిష్ట పోలీసు భద్రత

- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ప్రొద్దుటూరు క్రైం: దసరా ఉత్సవాల్లో పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ప్రొద్దుటూరులో జరుగనున్న దసరా ఉత్సవాల సందర్భంగా పోలీసు భద్రతా ఏర్పాట్లను బుధవారం ఎస్పీ పరిశీలించారు. అమ్మవారిశాల, శివాలయం, కొర్రపాడు రోడ్డులోని జమ్మిచెట్టు, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లను ఎస్పీ పరిశీలించారు. అనంతరం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులకు బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఎలాంటి ఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలంకు సూచించారు. ట్రాఫిక్‌కు అవాంతరం లేకుండా చూడాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని చెప్పారు. నవరాత్రుల సందర్భంగా ఆలయాలకు మహిళలు అత్యధికంగా రానున్న నేపథ్యంలో దొంగతనాలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు క్రైమ్ పార్టీలతో నిఘా ఉంచాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఎగ్జిబిషన్‌లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

జగన్మాతా.. నమోస్తుతే.!

- నేటి నుంచి దసరా సందడి
- ఆలయాలలో ప్రత్యేక పూజలు



ప్రొద్దుటూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరి



ప్రొద్దుటూరులోని చెన్నకేశవస్వామి ఆలయ ముఖద్వారం వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సెట్టింగ్

దసరా పండుగ వచ్చేసింది. హిందువుల పండుగల్లో ఎక్కువరోజులు నిర్వహించుకునే ఈ పెద్ద పండుగ గురువారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని అన్ని అమ్మవారి ఆలయాలు పూజలతో కళకళలాడనున్నాయి. సాయంత్రం రోజుకో అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల సందడి మొదలవుతుంది. ఆలయాలు గల వీధులన్నీ కనుల విందైన మండపాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో పది రోజులపాటు కళకళలాడనున్నాయి. ఆలయాల వద్ద రాజమందిరాలను తలపించేలా సెట్టింగ్‌లు తీర్చిదిద్దారు. మైసూరు తర్వాత ప్రొద్దుటూరులో ఆస్థాయి వైభవంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రోజూ ప్రత్యేక అలంకారంతోపాటు శమీ దర్శన కార్యక్రమాన్ని గతం కంటే వినూత్నంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ప్రొద్దుటూరు కల్చరల్

పండుగ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రొద్దుటూరు క్రైం: దసరా సందర్భంగా ప్రొద్దుటూరులో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. ఉత్సవాలకు వచ్చే మహిళలు తమ విలువైన ఆభరణాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురువారం నుంచి 10 రోజుల పాటు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్‌ను మళ్లించినట్లు డీఎస్పీ తెలిపారు.

- జమ్మలమడుగు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ప్రొద్దుటూరు టౌన్‌లోకి రాకుండా పాట్టిపాడు క్రాస్ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించాలి.
- మైదుకూరు వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా ఆర్టీసీ బస్టాండు దగ్గర నుంచి రాకపోకలు సాగించాలి.
- రాజుపాళెం మండలం వైపు నుంచి బస్సులు ప్రొద్దుటూరు టౌన్ లోకి రాకుండా కొర్రపాడు రోడ్డులో ఉన్న కాల్వకట్ట, మల్లేలమ్మ ఆలయం వద్ద నుంచి రాకపోకలు కొనసాగించాలి.
- ఎర్రగుంట్ల వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా వాసవి సర్కిల్, సినీహబ్ మీదుగా ఆర్టీసి బస్టాండు చేరుకొని రాకపోకలు సాగించాలి.
- జమ్మలమడుగు, రాజుపాళెం వైపు నుంచి వచ్చే వారు తమ బైక్‌లు, కార్లను ఎగ్జిబిషన్ పార్కింగ్ స్థలం, మార్కెట్ యార్డులో పార్క్ చేసుకోవాలి.
- మైదుకూరు వైపు నుంచి వచ్చే వారు జిన్నారోడ్డు గుండా వెళ్లి కొవ్వూరు గ్యారేజీలో వాహనాలను నిలుపుకోవాలి.
- ఎర్రగుంట్ల వైపు నుంచి కార్లలో, బైక్‌లలో వచ్చే వక్తులు ఆర్య వైశ్య వృద్ధాశ్రమం వెనుక వైపున ఉన్న స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవాలి.

క్లుప్తంగా

ఆపూస్మ నూతన కార్యవర్గం ఎన్నిక

– జిల్లా అధ్యక్షుడిగా గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్‌రెడ్డి


గంగయ్య


శివశంకర్‌రెడ్డి


వెంకటసుబ్బయ్య


నాగసుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఆపూస్మ) నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఇందులో ఆపూస్మ జిల్లా అధ్యక్షుడిగా గంగయ్య(బాల వికాస్ స్కూల్, కడప), జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివశంకర్‌రెడ్డి(నాగార్జున స్కూల్, కడప), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటసుబ్బయ్య (సాయి హైస్కూల్, సిద్దవటం) ట్రెజరర్‌గా నాగసుబ్బారెడ్డి(శ్రీభాష్యం, కడప) లతోపాటు 40 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగయ్య, శివశంకర్‌రెడ్డిలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రాళ్ల ట్రాక్టర్ బోల్తా



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని కదిరివారిపల్లె గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రాళ్ల ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ టైర్ ఒక్కసారిగా పగలడంతో ట్రాలీలో ఉన్న నాపరాళ్లు పగిలి పోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపైన పడి ఉన్న రాళ్లను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన కార్యవర్గం


గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన కార్యవర్గం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక పాత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోగల రెవెన్యూ భవన్‌లో ఎన్నిక జరిగింది. గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కిరణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడిగా సతీష్, జిల్లా ట్రెజరర్‌గా వెంకటసుబ్బయ్య, జిల్లా సహాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా చెంద్రాయుడు, నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, అబ్రహాం, శివశంకర్, పవన్ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఏపీఆర్ ఎస్‌ఏ జిల్లా ట్రెజరర్ కేపీ రొనాల్డ్ శ్యామూల్ సహకరించారు. నూతన కార్యవర్గానికి ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీజేఏసీ- అమరావతి సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

పేదల డాక్టర్.. ఈసీ గంగిరెడ్డి

- చిన్నపిల్లల వైద్యుడిగా.. మంచి హస్తవాసిగా ప్రాచుర్యం
- రాజకీయ నాయకుడిగా తనదైన పాత్ర
- నేడు దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి నాలుగో వర్ధంతి
- పాల్గొననున్న వైఎస్ కుటుంబ సభ్యులు


వైద్య సేవలో ఈసీ గంగిరెడ్డి(ఫైల్)

పులివెందుల రూరల్ : దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పేదల డాక్టర్‌గా పులివెందుల ప్రాంతంలో గుర్తింపు పొందారు. ఆయన హస్తవాసి తగిలితే ఎంతటి రోగమైనా ఇట్టే నయమవుతుందని ఈ ప్రాంత వాసుల నమ్మకం. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిన్నపిల్లల డాక్టర్‌గా ప్రాచుర్యం పొందారు. 1949 ఏప్రిల్ 20వ తేదీన ఈసీ సిద్దారెడ్డి, తులశమ్మ దంపతులకు రెండవ సంతానంగా వేముల మండలంలోని గొల్లలగూడూరులో ఆయన జన్మించారు. తన విద్యాభ్యాసం 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు గొల్లలగూడూరు ఆర్‌సీఎం స్కూలు, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పులివెందులలోని జెడ్పీ హైస్కూలులోనూ, 9వ తరగతి నుంచి 11వ తరగతి వరకు వేముల జెడ్పీ హైస్కూలులోనూ, అనంతరం వైద్య విద్యను వారణాసిలోని బెనారస్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. అనంతరం పులివెందులలోని వైఎస్ రాజారెడ్డి ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రారంభించారు. తర్వాత పులివెందులలోని శ్రీనివాసహాలు వీధిలో తన సతీమణి డాక్టర్ ఈసీ సుగుణమ్మతో కలిసి గంగిరెడ్డి ఆసుపత్రి స్థాపించి దంపతులిద్దరూ వైద్య సేవలు అందించేవారు. వైద్యం చేయడమే ప్రధాన ఆశయంగా ప్రతిఫలం ఆశించని డాక్టర్‌గా ఇక్కడ గుర్తింపు పొందారు. ఎలాంటి రోగమైనా ఆయన దగ్గరకు వెళ్లి ఆయన చేయి పడితే నయమవుతుందని పులివెందుల ప్రాంత ప్రజల నమ్మకం. పులివెందుల ప్రాంత ప్రజలే కాకుండా జిల్లా నలుమూలల నుంచి పొరుగు జిల్లాలైన అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి కూడా ఆయన వద్దకు వచ్చి రోగులు వైద్య సేవలు పొందేవారు. వైద్య సేవలలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆయన భాకరాపురంలో అత్యాధునిక వైద్య పరికరాలతో తన కుమారుడి పేరిట దినేష్ నర్సింగ్ హోం (ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి) స్థాపించి వైద్య సేవలు అందించేవారు. ఈసీ గంగిరెడ్డి కుమారుడు ఈసీ దినేష్‌రెడ్డి కూడా వైద్యునిగా సేవలు అందిస్తున్నారు. ఈసీ గంగిరెడ్డి తన దగ్గరకు వచ్చే రోగులపట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతలను కనబరిచేవారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 12 గంటలవరకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించేందుకు ఆయన తపన పడేవారు. దినేష్ నర్సింగ్ హోం ద్వారా అనేక ఉచిత మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించి పేద ప్రజలకు సేవ చేసేవారు.

రాజకీయ ప్రస్థానం..

డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 2001 నుంచి 2005 వరకు పులివెందుల మండల ప్రెసిడెంట్‌గా ప్రజలకు సేవలు అందించారు. వైఎస్ కుటుంబం పోటీ చేసే ప్రతి ఎన్నికలలోనూ ఆయన తన వంతు పాత్ర పోషించేవారు. ఎన్నికల సమయంలో వైఎస్ కుటుంబానికి మద్దతుగా నియోజకవర్గంలో ఆయన ప్రచారం నిర్వహించేవారు. 2003 రబీ సీజన్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు విత్తనాలు సక్రమంగా సరఫరా చేయలేదని పులివెందుల నుంచి కడప కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు.

నేడు దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి నాలుగో వర్ధంతి

దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి నాలుగో వర్ధంతిని గురువారం పులివెందులలో ఘనంగా నిర్వహించనున్నారు. డిగ్రీ కళాశాల రోడ్డులో గల వైఎస్సార్ సమాధుల తోటలో ఉన్న డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఘాట్ వద్ద గురువారం డాక్టర్ ఈసీ గంగిరెడ్డి కుమార్తె వైఎస్ భారతిరెడ్డి, సతీమణి ఈసీ సుగుణమ్మ, వైఎస్ కుటుంబీకులు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. అనంతరం స్థానిక భాకరాపురంలో గల దినేష్ నర్సింగ్ హోంలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

వృద్ధులపై టీడీపీ వర్గీయుల దాడి


టీడీపీ వర్గీయుల చేతిలో దాడికి గురైన వృద్ధ దంపతులు వెంకటరమణ, నారాయణమ్మ

చక్రాయపేట : పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలో టీడీపీ వర్గీయులు వృద్ధులపై దాడి చేశారు. ఈ సంఘటన నెరుసుపల్లె గ్రామం దేవరగుట్టపల్లెలో జరిగింది. బాధితులు వెంకటరమణ, నారాయణమ్మలు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత 60 ఏళ్ల నుంచి తమ అనుభవంలో ఉన్న భూమిని టీడీపీ వర్గీయులైన దాసరి నాగేంద్ర, నాగమునిలు ఆక్రమించుకొని ఉలవ పంట వేశారు. తమ పొలం తమకు వదిలేయండి అని ప్రాధేయపడినా వారు వినిపించుకోలేదు. దీంతో వీరు పంటను దున్నేశారు. ఈ కారణంగా ఇంట్లో ఉన్న తమపై టీడీపీ వర్గీయులు దాడి చేసి కొట్టారని బాధితులు తెలిపారు. విడిపించేందుకు అడ్డుగా వచ్చిన తమ కూతురిపై కూడా దాడి చేశారని వాపోయారు. ఈ సంఘటనపై నాగేంద్ర, నాగముని, ప్రత్యూషలతో పాటు మరొకరిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

సమాజంలో గురువులదే కీలకపాత్ర

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి


ఉత్తమ ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు, ఇతర అతిథులు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే గనుక సమాజం బాగులో వారి పాత్రే కీలకమని అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు ఎం.రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అపుస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిభ కలిగిన ప్రైవేటు ఉపాధ్యాయులను గుర్తించి గౌరవించాలన్నారు. కేరళ, హుద్‌హుద్ తుపాను, విజయవాడ వరదల్లో తమ సంఘం ఎన్నో సేవా కార్యక్రమాలను అందించిందన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రైవేటు పాఠశాలల రెన్యూవల్‌ను 8–10 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల వల్ల ప్రైవేటు పాఠశాలల మనుగడ ప్రమాదంలో పడిందన్నారు. రెన్యూవల్‌ను 8–10 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ప్రైవేటు పాఠశాలల్లో కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు. హెల్త్ స్కీమ్ ప్రీమియం సగం ప్రైవేటు పాఠశాలలు, మరో సగం ప్రభుత్వం భరించే విధంగా చూస్తామన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అపుస్మా జిల్లా అధ్యక్షుడు గంగయ్య మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వాలకు చిన్నచూపు తగదన్నారు. రాష్ట్రంలో 47 శాతం విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతూ పరీక్షా ఫలితాల్లో అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. అపుస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు టీచర్లకు ఇంటి స్థలాలు, రుణాలు, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో అపుస్మా గుంటూరు జిల్లా అధ్యక్షుడు పోతిరెడ్డి, జోనల్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, మైథిలి, గౌరవాధ్యక్షులు రామిరెడ్డి, రవీంద్రారెడ్డి, ఎలియాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

ప్రొటోకాల్ రగడ

- మొన్న రిమ్స్‌లో తమ పేర్లు లేవని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు
- నేడు మేయర్‌కు ఆహ్వానం లేకుండానే గాంధీ ప్లాజా ప్రారంభం


గాంధీ ప్లాజాను ప్రారంభిస్తున్న కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి

కడప కార్పొరేషన్ : ప్రజా ప్రతినిధులకు సరైన గౌరవం ఇచ్చి ప్రొటోకాల్ పాటించాల్సిన అధికారులు ఈ మధ్య కాలంలో తరచూ విమర్శలు ఎదుర్కొంటున్నారు. కొందరు ప్రజా ప్రతినిధుల మెప్పు కోసం ఇలా చేస్తున్నారా.... లేదా ప్రొటోకాల్ తెలియక చేస్తున్నారా అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. మొన్న రిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వైద్య, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకంలో మంత్రి పేరు మినహా మరెవరి పేర్లు రాయలేదు. దీంతో కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డిలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల పేర్లయితే అసలే రాయలేదు. ఇది మర్చిపోకముందే బుధవారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని ఎర్రముక్కపల్లెలో గాంధీనగర్ ఉన్నత పాఠశాల ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పూర్తి చేసిన గాంధీప్లాజాను ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. కాగా ఈ కార్యక్రమానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డినిగానీ, నగర ప్రథమ పౌరుడైన మేయర్ సురేష్ బాబును ఆహ్వానించడంగానీ, శిలాఫలకంలో వారి పేర్లు రాయడంగానీ చేయలేదు. నగరపాలక అధికారుల తీరుపై మేయర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు సీడీఎంఏకు లేఖ రాసినట్లు తెలిసింది. ప్రజా ప్రతినిధులందరినీ గౌరవించాల్సిన అధికారులు ఇలా పక్షపాతంగా ఒకరి మెప్పు కోసం మరొకరి హక్కులను కాలరాయడం...అవమానించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కన్ను పడితే.. బైక్ మాయం

- నకిలీ తాళం చెవితో పార్కింగ్ చేసిన బైక్‌లను కొట్టేసిన ఘనుడు
- నిందితుడు అరెస్ట్, 10 బైక్‌లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ యుగంధర్, ఎస్‌ఐలు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : అతను జల్సాలకు అలవాటు పడ్డాడు. అతని కన్ను పడితే బైక్ మాయం కావాల్సిందే. రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను ఎంచుకొని చాకచక్యంగా మాయం చేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అతను చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. బైక్‌లను చోరీ చేస్తూ పట్టణంలో పోలీసులతో పాటు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న సోమిరెడ్డిపల్లె లాజరయ్య అనే దొంగను టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ వివరాలను టూ టౌన్ సీఐ యుగంధర్ బుధవారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. బి.మఠం మండంలోని నరసన్నపల్లె హరిజనవాడకు చెందిన లాజరయ్య కూలి పని చేసుకొని జీవనం సాగించేవాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బైక్‌లను దొంగిలించాలని భావించాడు. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను ఎంచుకొని చోరీ చేసేవాడు. నకిలీ తాళం చెవి సాయంతో లాక్ తీసి బైక్‌లను కొట్టేసేవాడు. ఈ క్రమంలో తమ బైక్‌లు కనిపించలేదని చాలా మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టూ టౌన్ సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేశారు. లాజరయ్య అనే వ్యక్తి బైక్‌లను చోరీ చేసినట్లు నిర్ధారించుకున్నారు. చోరీ చేసిన బైక్‌లను బెంగళూరుకు తీసుకెళ్లి విక్రయించాలనే ఉద్దేశంతో వాటిని బి. మఠం మండలంలోని తన ఇంటి వద్ద కంపచెట్లలో దాచి పెట్టాడు. బుధవారం మడూరు రోడ్డులోని ప్రకాష్‌నగర్ వద్ద టూ టౌన్ సీఐ యుగంధర్, ఎస్‌ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రారెడ్డిలు సిబ్బందితో కలిసి నిందితుడు లాజరయ్యను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మంచి ప్రతిభ కనబరచిన సిబ్బంది రవీంద్రనాయక్, రామాంజులును డీఎస్పీ భక్తవత్సలం, సీఐ యుగంధర్‌లు అభినందించారు.

చేపల వలలో చిక్కుకుని బాలుడి మృత్యువాత


మృతి చెందిన షేక్ ఇస్మాయిల్

సిద్దవటం : పుల్లంపేటలోని జెండామాను వీధికి చెందిన షేక్ జాఫర్ హుస్సేన్ కుమారుడు షేక్ ఇస్మాయిల్(6) బుధవారం సిద్దవటంలోని పెన్నానది నీటిలో మునిగి మృతి చెందాడని ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా పుల్లంపేటలోని జెండామాను వీధికి చెందిన షేక్ ఖాజామొహిద్దీన్, షేక్ సాబీర్ అనే అన్నదమ్ములు పిల్లలకు సెలవు కావడంతో బుధవారం తన కుటుంబీకులతో సిద్దవటంలోని కోటను చూసి, పెన్నా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే ఖాజామొహిద్దీన్ పెద్ద తమ్ముడు షేక్ జాఫర్ హుస్సేన్ చిన్న కుమారుడు ఇస్మాయిల్ నేను వస్తానని మారాం చేస్తుంటే ఆ బాలున్ని వెంట పెట్టుకొని వచ్చారు. సిద్దవటం పెన్నానది లోలెవల్ కాజ్‌వే వద్ద ఉన్న నీటిలో ఈత కొడుతుండగా ఒక్కసారిగా ఇస్మాయిల్ లోతులోకి వెళ్లి మునిగి పోయాడు. బాలుని పెద్దనాన్న, చిన్నాన్నలు లోతు నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేకుండా పోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక ఈతగాళ్లను రప్పించి నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు చేపల వలకు చిక్కుకున్న బాలుడిని బయటకు తీశారు. ఇస్మాయిల్ పుల్లంపేటలోని శాంతినికేతన్ స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్నాడు. షేక్ జాఫర్ హుస్సేన్, జరీనా దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు, మృతుడు ఇస్మాయిల్ చివరి వాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

కార్లను అద్దెకు తీసుకుని.. ఆపై కుదువ పెట్టి..

- చీటింగ్‌కు పాల్పడిన ఇద్దరి అరెస్ట్
- రూ. 2కోట్ల విలువైన 37 కార్లు స్వాధీనం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు


కార్లను పరిశీలించి వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : తమకు జిల్లా స్థాయిలో ప్రభుత్వ అధికారులు పరిచయమని, నెలకు రూ. 30వేలు కారుకు అద్దె చెల్లిస్తామంటూ కొద్ది నెలలు అద్దె చెల్లిస్తారు. కార్లు తిరిగి ఇవ్వకుండా కార్లకు అద్దె చెల్లించకుండా ఉంటూ మోసానికి పాల్పడిన కడప నబీకోటకు చెందిన నిమ్మకాయల వెంకట శిధర్‌రెడ్డి (38), షేక్ జిలానీ (21) అనే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 2కోట్ల విలువైన వివిధ కంపెనీల 37 కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కడప నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కడప నగరం నబీకోటకు చెందిన వీరేందర్ అనే బాధితుడు తన మూడు కార్లు అద్దెకు తీసుకుని మొదటి రెండు నెలలు అద్దె చెల్లించి తరువాత అద్దె ఇవ్వకుండా, కార్లు ఇవ్వకుండా మోసం చేశారని నిమ్మకాయల శిధర్‌రెడ్డి, షేక్ జిలానీలపై సెప్టెంబర్ 25న కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అద్దె పేరిట మరో 34 కార్లను తీసుకుని యజమానులను మోసం చేసి కుదువకు పెట్టినట్లు పోలీసులు విచారణలో గుర్తించారన్నారు. దాదాపు 15 మంది వద్ద రూ. 47 లక్షలకు కుదువపెట్టి మొత్తం రూ. 2 కోట్ల విలువైన 37 కార్లను తాలూకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. దాదాపు 20 మంది కార్ల యజమానులు బాధితులుగా ఉంటారన్నారు. కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్. రమాకాంత్ పర్యవేక్షణలో అతి తక్కువ సమయంలో కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు రూ. 2కోట్ల విలువైన 37 కార్లను రికవరీ చేసిన కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ డి. తాహీర్‌హుసేన్, హెడ్‌కానిస్టేబుళ్లు శేఖర్, విద్యాసాగర్, కానిస్టేబుళ్లు రమేష్, సునీల్‌లను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

చక్రాయపేట : మండలంలోని మార్లెళ్లమడక గ్రామం కొండవాండ్లపల్లెకు చెందిన రమాదేవి(28) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆర్కే వ్యాలీ పోలీసులు తెలిపారు. గత కొంత కాలంగా ఆమె కడుపునొప్పితో బాధ పడుతుండేదని చెప్పారు. దీంతో ఆమె నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి 8 సంవత్సరాల లోపు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వివాహేతర సంబంధమా.. ఆర్థిక లావాదేవీలా?

- కానిస్టేబుల్ కేసులో ఎన్నో అనుమానాలు
- సంఘటనపై నోరువిప్పని కానిస్టేబుల్


చికిత్స పొందుతున్న కానిస్టేబుల్

పెండ్లిమర్రి : కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని వైవీయూ వద్ద గత సోమవారం అర్ధరాత్రి కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న సంఘటనలో ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివాహేతర సంబంధాలా లేక ఆర్థిక లావాదేవిల కారణంగా హత్యాయత్నం జరిగిందా అనే చర్చ జరుగుతోంది. కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికి సంఘటన గురించి నోరు విప్పడం లేదు. సంఘటన స్థలానికి చేరుకున్న బంధువులు, స్నేహితులు తొలుత రోడ్డు ప్రమాదంగా భావించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా పలు అనుమానాలు రావడం, కారుకు ఎలాంటి నష్టం జరగకపోవడం, చిన్నపాటి రంపం దొరకడంతో పోలీసులు రహస్యంగా విచారణ చేపడుతున్నారు. సంఘటన గురించి పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. ఇప్పటికే పోలీసులు కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. మంగళవారం రాత్రి పెండ్లిమర్రి మండలంలో శ్రీనివాస్‌రెడ్డి బంధువులను, 108 సిబ్బందిని పిలిపించి విచారణ చేపట్టారు. సంఘటనకు ముందు, జరిగినప్పటి నుంచి కానిస్టేబుల్ ఎవరికి ఫోన్ చేశాడు. అని కాల్ లిస్ట్ ఆధారంగా విచారణను కొనసాగిస్తున్నారు. పెండ్లిమర్రి, వేంపల్లె సీఐల ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది.

మరో బాలుడి మృతదేహం లభ్యం

మైదుకూరు : ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు కేసీ కాలువలో గల్లంతైన సంఘటనలో బుధవారం ఉదయం మరో బాలుడు రఫీ (9) మృతదేహాన్ని కేసీ కాలువలో కనుగొన్నారు. స్థానిక శాంతినగర్ ప్రాంతంలోని ఆవులోల్ల కాలనీకి చెందిన యాసిన్, రఫీ అనే ఇద్దరు బాలురు మంగళవారం ఈతకు వెళ్లి కేసీ కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే. ఇందులో యాసిన్ అనే బాలుడి మృతదేహం మంగళవారం రాత్రి లభించింది. పోలీసుల విజ్ఞప్తి మేరకు కేసీ కాలువ అధికారులు కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించారు. బుధవారం ఉదయం బద్వేలు రోడ్డులోని అరుంధతి నగర్ సమీపంలో బాలుడి మృతదేహం కాలువలో దొరికింది. చిన్నారుల మృతితో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

కడప అర్బన్ : జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు. బుధవారం కడపలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌బీఐ ఏటీఎంల దోపిడీ దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో విచారణ చేయిస్తున్నామన్నారు. హర్యానా రాష్ట్రం మేవాత్ జిల్లాలో దాదాపు 15 గ్యాంగ్‌లు ఉన్నాయని, వారంతా పక్కా ప్రొఫెషనల్‌గా దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం 15 నుంచి 20 నిమిషాలలోపే సాంకేతికంగా పరిజ్ఞానం కలిగిన దొంగలలో ఒకరిద్దరి సహకారంతో ఏటీఎం మిషన్‌ను సులభంగా తెరువగలుగుతున్నారన్నారు. ముంబయిలోని ఎస్‌బీఐ సెంట్రల్ ఆఫీస్ నుంచి అప్రమత్తమయ్యేలోపు దొంగలు దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. వారు ఉపయోగించిన కారును వెంటనే తమ వెంట తెచ్చుకున్న కంటైనర్ లాంటి వాహనంలోకి ఎక్కిస్తారన్నారు. ఇలా అందరి కళ్లుగప్పి పరారైపోతారన్నారు.

- కడప నగరంలోని రిమ్స్‌తో పాటు, పలు కూడళ్లలో బైక్ రైడ్ చేస్తున్న వారికి ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. కడప, ప్రొద్దుటూరులో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు.
- వైవీయూ సమీపంలో కానిస్టేబుల్ శ్రీనివాసులరెడ్డి అనుమానాస్పద స్థితిలో గాయాలతో రోడ్డుపై పడి ఉన్న సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా? లేక కక్షసాధింపు సంఘటనా? తదితర అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని విచారిస్తున్నామని చెప్పారు.
- జిల్లాలో వేముల మండలం లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ లాంటి పేలుడు పదార్థాలను ఉపయోగించేవారు లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. మైన్స్ లీజుదారులపై నిఘా ఉంచుతామని, విస్తృతంగా దాడులను కొనసాగిస్తున్నామని తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి


గాంధీ విగ్రహం ఎదుట దీక్ష చేపడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు తదితరులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి, కార్మిక, రైతు సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా కడప నగరంలోని ఒకటో గాంధీ బొమ్మ ఎదురుగా నిరసన దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తోందన్నారు. వీఆర్ఎస్, డిప్యుటేషన్ పేరుతో వేలాది మంది ఉద్యోగులను బయటికి నెట్టే ప్రక్రియ ప్రారంభించారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, మద్దిలేటి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం రైతులు భూమి ఇచ్చారని అందుకు పరిహారంగా 50 శాతం ఉద్యోగాలు భూ నిర్వాసితులకు ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు 98 స్పష్టం చేస్తున్నాయన్నారు. అయినా వాటిని లెక్క చేయకుండా ఇష్టం వచ్చినట్లు ఆర్టీపీపీ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆర్టీపీపీని తన చెప్పు చేతుల్లో పెట్టుకుని వారి కార్యకర్తలను, అనుచరులను ఆర్టీపీపీలో ఉద్యోగులుగా చేర్చాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యుడు పి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.